
సాక్షి
నిజామాబాద్
సోమవారం । 17 । జూలై । 2023



పనితీరులో వెనక'బడి'
పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత కారణంగా కేంద్ర విద్యాశాఖ రిపోర్ట్‌లో ఉమ్మడి జిల్లా వెనకబడింది.
- 8లో ▸



యథేచ్ఛగా ఇసుక దందా
రెంజల్ మండలంలోని కందకుర్తి శివారులో యథేచ్ఛగా ఇసుక దందా సాగుతోంది. రాత్రీపగలు ఇసుకను తరలిస్తున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.5 /22.7

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం నన్నటి జల్లులు కురిసే అవకాశముంది. సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిజామాబాద్ ఆర్డీవోగా రాజేంద్రకుమార్

సుభాష్‌నగర్: నిజామాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)గా రాజేంద్ర కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న టి రవిని రెవెన్యూశాఖకు రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొంది. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా అదనపు కలెక్టర్ సహా ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది.

కాగా త్వరలోనే తహసీల్దార్ల బదిలీలు కూడా చేపట్టనున్నారు. ఈనెల 31వ తేదీ లోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ పేర్కొన్న విషయం తెలిసిందే. జిల్లాలో మాక్లూర్‌తో పాటు ఒకరిద్దరు తహసీల్దార్లు మినహా మిగతా వారంతా బదిలీ అయ్యే అవకాశముందని రెవెన్యూ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

బదిలీ అయిన ఎస్సైలు రిలీవ్

ఖలీల్ వాడి : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో బదిలీ అయిన 47 మంది ఎస్సైలు ఆదివారం రిలీవ్ అయ్యారు. వీరి స్థానంలో జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఎస్సైలు సోమవారం, మంగళవారం జాయిన్ కానున్నారు. జిల్లాకు చెందిన ఎస్సైలు మంగళవారం జాయిన్ కానున్నట్లు సమాచారం.

నిజాంసాగర్‌లోకి 771 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 771 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మంజీర నది పారుతోంది. దీంతో నిజాంసాగర్‌లోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,387.60 అడుగుల(3.157 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

విలీన గ్రామాలకు అమృత్ లేనట్లేనా!

- తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఇదీ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిస్థితి
- 2023–24కు గాను రూ. 217కోట్లతో 15 ట్యాంకుల నిర్మాణానికి ఏర్పాట్లు
- విలీన గ్రామాలకు ఒక్క ట్యాంక్ కూడా కేటాయించని వైనం


తిలక్‌గార్డెన్‌లో కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంక్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడున్నరేళ్ల క్రితం విలీనమైన గ్రామాల్లో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం లేదు. విలీన గ్రామాల నియోజకవర్గం వేరుగా ఉండడంతో తమను కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం 'అమృత్' పథకం కింద నిధులు కేటాయిస్తోంది. 2018–19లో మొదటి విడతగా రూ.98 కోట్లు వచ్చాయి. అయితే ఈ నిధులతో నగరంలోని తిలక్‌గార్డెన్, ప్రగతినగర్, మహాలక్ష్మీనగర్, మిర్చికాంపౌండ్, నిజాంకాలనీ, ఖిల్లా, నాగారం, బడాబజార్ ప్రాంతాల్లో 8 ట్యాంకుల నిర్మాణం 2021లో పూర్తి చేశారు. ఇందులో 16 లక్షల లీటర్ల కెపాసిటీ ట్యాంక్‌లు 2 ఉన్నాయి. 14 లక్షల లీటర్ల కెపాసిటీ ట్యాంక్‌లు 2 నిర్మించారు. 12 లక్షల లీటర్ల కెపాసిటీ ట్యాంకు ఒకటి, 5లక్షల లీటర్ల కెపాసిటీ ట్యాంకులు 2 చోట్ల, 7లక్షల లీటర్ల ట్యాంక్ ఒకచోట నిర్మించారు.

అదేవిధంగా 2023–24 సంవత్సరానికి గాను రెండోవిడతలో 'అమృత్' పథకం కింద కొత్తగా మరో 15 ట్యాంకుల నిర్మాణానికి రూ.217 కోట్లు మంజూరయ్యాయి. అవసరమైన ట్యాంకుల నిర్మాణం కోసం త్వరలో సర్వే చేయనున్నారు. అనంతరం టెండర్ల ప్రక్రియ ప్రారంభించనున్నారు.

శీత కన్ను..

నగర పాలక సంస్థలో 9 గ్రామాలు విలీనం చేశారు. గూపన్‌పల్లి, ముబారక్‌నగర్, బోర్గం–కె, మాణిక్ భండార్, కాలూర్, ఖానాపూర్, సారంగపూర్, బోర్గాం(పి), మాధవనగర్ గ్రామాలున్నాయి. గత మూడున్నరేళ్లుగా ఈ ప్రాంతాల్లో అభివృద్ధి అనుకున్నంత మేర జరుగలేదు. పన్నులు మాత్రం ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా 'అమృత్' పథకం కింద విలీన గ్రామాల్లో వాటర్ ట్యాంకులు నిర్మించే ఆలోచన లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతీలుగా ఉన్న సమయంలో ఏళ్ల కిందట కట్టిన చిన్న చిన్న ట్యాంకులు మాత్రమే వీరికి దిక్కవుతున్నాయి.

ఇప్పటికీ మంచినీళ్లు రావడం లేదు



ఒకటో డివిజన్‌లో ఉన్న ఖానాపూర్ పరిధిలో ఉన్న మా భాగ్యనగర్ కాలనీకి ఇప్పటివరకు మంచినీటి సరఫరా చేయడం లేదు. మంచినీళ్లు సరఫరా చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేదు. నిజామాబాద్ నగరంలో మంచినీటి ట్యాంకులు నిర్మిస్తున్నారు. మా ప్రాంతానికి మాత్రం ట్యాంకులు కేటాయించలేదు. ఖానాపూర్ డివిజన్‌లో కూడా ట్యాంకు నిర్మించి మంచినీళ్లు సరఫరా చేయాలి.

– మోచి గణేశ్, భాగ్యనగర్, ఖానాపూర్

విలీనం చేసి వదిలేస్తారా..



మా గ్రామాన్ని మూడున్నరేళ్ల క్రితం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ఏళ్లు గడుస్తున్నప్పటికీ మాకు మంచినీటి సరఫరా లేదు. బోర్ నీరు తాగలేక డబ్బా నీళ్లు తాగుతున్నాము. మా గ్రామానికి మంచినీటి ట్యాంకు నిర్మించి మున్సిపల్ నీళ్లు సరఫరా చేయాలి.

– కంటం కల్యాణ్, కాలూర్

15 ట్యాంకుల నిర్మాణానికి నిధులు

నగర పరిధిలో అమృత్ పథకం కింద రెండవ విడతలో రూ.217 కోట్లు మంజూరయ్యాయి. 15 ట్యాంకుల నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. టెండర్ ప్రక్రియ చేపట్టాం. త్వరలోనే నగరంలో సర్వే చేసి ఎక్కడ అవసరం ఉందో అక్కడ ట్యాంకుల నిర్మాణం చేస్తాం. మొదటి విడతలో 8 ట్యాంకులు నిర్మాణం పూర్తయ్యాయి. ప్రస్తుతం విలీన గ్రామాల్లో ట్యాంకులు నిర్మించడం లేదు.

– తిరుపతి, ఈఈ, పబ్లిక్ హెల్త్

కేంద్ర నిధులు దుర్వినియోగం


వేల్పూర్‌లో పెద్దవాగు వంతెన వద్ద శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

- కల్వకుంట్ల కుటుంబానికి మంత్రి ప్రశాంత్ రెడ్డి దోచి పెడుతున్నారు
- ఎంపీ ధర్మపురి అర్వింద్

వేల్పూర్ : పీఎం మోదీ విజన్ కింద గ్రామస్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేయాలని వడ్డీలేని రుణాల కింద ఇస్తున్న నిధులను మంత్రి ప్రశాంత్ రెడ్డి కల్వకుంట కుటుంబానికి దోచి పెడుతున్నారని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. ఆదివారం వేల్పూర్ వద్ద పెద్దవాగుపై నిర్మించిన వంతెనపై మాట్లాడారు. కేంద్రప్రభుత్వం నాలుగేళ్లలో రాష్ట్రానికి రూ. 5,221 కోట్ల స్పెషల్ అసిస్టెంట్ ఫండ్‌ను 50 ఏళ్ల వడ్డీ లేని రుణం కింద ఇవ్వగా, ఇందులో జిల్లాకు రూ. రూ. 317.72 కోట్ల నిధులు వచ్చాయన్నారు. వీటితో రూ. 51 కోట్లతో వంతెనలు, రహదారులు, ఆస్పత్రులు ఇతర పనులు చేపట్టారన్నారు. ఈ నిధులు రాష్టం కట్టే పన్నుల్లో వాపసు వచ్చే 42 శాతం పన్నుల కిందగాని, ఎఫ్‌ఆర్‌బీఎం ద్వారా సేకరించే రుణానికి గాని ఎటువంటి సంబంధం లేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతో వేల్పూర్, మోతె వంతెనలు, ఇతర రహదారులు నిర్మించి అవే పనులపై రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకున్నారన్నారు. దీంతో డబుల్ బిల్లింగ్ జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. 51 ప్రాజెక్టుల్లో 125 శాతం కమీషన్ కల్వకుంట్ల కుటుంబానికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి అందజేస్తున్నారన్నారు. నిజామాబాద్ జిల్లాలో రూ. 317 కోట్లతో చేసిన పనులన్నీ డబుల్ బిల్లింగ్‌తో ఉన్నవేనన్నారు. బట్టాపూర్ క్వారీలో రూ. 400 కోట్ల అవినీతి జరిగిందన్నారు. బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, ఏలేటి మల్లి కార్జున్ రెడ్డి, మల్కన్నగారి మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద

- గోదావరి నుంచి 13,416 క్యూసెక్కులు
- పునరుజ్జీవనం ద్వారా 4,350 క్యూసెక్కులు
- పెరుగుతున్న నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతంలోని గోదావరి నుంచి 13,416 క్యూసెక్కులు, పునరుజ్జీవన పథకం ద్వారా మూడు పంపులతో 4,350 క్యూసెక్కుల నీరు, మొత్తంగా కలిపి 17,496 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1069.80అడుగుల(28.6 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీరు

ఎస్సారెస్పీకి జనకళ..

ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండడం, కాళేశ్వరం జలాలు పునరుజ్జీవన పథకం ద్వారా వస్తుండడంతో ప్రాజెక్టును సందర్శించేందుకు పర్యాటకులు వస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల్, హైదరాబాద్ నుంచి రైతులు తిలకించారు.

కాళేశ్వరంతో భూములన్నీ సస్యశ్యామలం


చింతలూర్‌లో కాళేశ్వరం నీటికి పూజలు చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

- మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- ఎమ్మెల్యే బాజిరెడ్డితో కలిసి చింతలూర్‌లో కాళేశ్వరం జలాలు విడుదల

జక్రాన్‌పల్లి : కాళేశ్వరం జలాలతో భూములన్నీ సస్యశ్యామలంగా మారుతాయిని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండలంలోని చింతలూర్ వద్ద పెద్దవాగులో 20, 21 ప్యాకేజీ ద్వారా కాళేశ్వరం జలాలను మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మర్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం నీళ్ల రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి అక్కడి నుంచి పైప్‌లైన్లు, పంపుహౌజ్‌ల ద్వారా 20, 21 ప్యాకేజీ ద్వారా సాగుకు నీళ్లు తీసుకొచ్చామన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు ఇచ్చినట్లు ప్రతి మూడు ఎకరాలకు ఒక అవుట్‌లెట్ వాల్వ్ ఏర్పాటు చేస్తామన్నారు. కరెంట్, బోరు, వర్షాలతో సంబంధం లేకుండా వాల్వ్ తిప్పగానే సాగునీరు మీ పంట పొలాల్లోకి చేరుతాయన్నారు.

పైప్‌లైన్‌తో సాగునీరు : ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి

రూరల్‌లో రైతులు భూములు నష్టపోకుండా కాలువల ద్వారా కాకుండా పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 2,600 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ వేసి కాళేశ్వరం జలాలను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీతో ఈ ప్రాజెక్టు డిజైన్ చేసినట్లు తెలిపారు. 25 చెక్‌డ్యాంలు పూర్తయ్యాయన్నారు. జక్రాన్‌పల్లిలో మూడు చోట్ల డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయిందని, పడకల్ చాంద్‌మియా బాగ్ నుంచి చేంగల్ వరకు రూ. 18 కోట్లతో డబుల్ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. ధర్పల్లి జెడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్మోహన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, సర్పంచ్ సుకన్య ప్రసాద్, సీనియర్ నాయకుడు డాక్టర్ మధుశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ తదితరులున్నారు.

ఊరంతా 'సౌర' కాంతి

- జీజీ నడ్కుడలో సోలార్ విద్యుత్ వెలుగులు
- పైలట్ ప్రాజెక్టుగా చేసిన ప్రయోగం విజయవంతం
- భారీ విద్యుత్ చార్జీల నుంచి పంచాయతీకి విముక్తి


గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లు

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలానికి చెందిన గంగ(జీజీ)నడ్కుడ మారుమూల గ్రామం. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామానికి ప్రస్తుతం ఒక ప్రత్యేకత ఏర్పడింది. పట్టణాలు, నగరాలను తలదన్నేలా సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని సమర్థవంతంగా నిర్వహిస్తోంది. త ద్వారా నిత్యం ఊరంతా 'సౌర' కాంతులతో వెలిగిపోతుంది. 'ఔరా' అనేలా అన్ని దిక్కులా సోలార్ పలకలను ఏర్పాటు చేసి అందరినీ అబ్బురపరుస్తోంది. భారంగా మారిన విద్యుత్ చార్జీలను నుంచి తప్పించుకోగా, తిరిగి ట్రాన్స్‌కోకే కరెంట్‌ను విక్రయించే స్థాయికి చేరింది. ఇంతకూ.. సోలార్ యూనిట్లు ఎవరిచ్చారు? ఎందుకిచ్చారు? ఈ అవకాశాన్ని గ్రామ పంచాయతీ ఎలా సద్వినియోగం చేసుకుంటుందో పూర్తి వివరాల్లోకి వెళ్లి తెలుసుకుందాం.



పైలట్ ప్రాజెక్టుగా ప్రయోగం

జిల్లాలో నారాయణరెడ్డి కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో జీజీ నడ్కుడలో తెలిసిన వ్యక్తులున్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించడానికి వచ్చిన సమయంలో ఊరి అభివృద్ధికి ఏదైనా చేయాలని సన్నిహితులు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా 'గ్రీన్ విలేజ్' కార్యక్రమంలో భాగంగా జీజీ నడ్కుడలో పైలట్ ప్రాజెక్టు కింద సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని నారాయణరెడ్డి నిర్ణయానికి వచ్చారు. ప్రయోగం విజయవంతమైతే వేరే గ్రామాల్లో కూడా ఏర్పాటు చేయవచ్చని భావించారు. ఆర్నెళ్ల క్రితం రెడ్‌కో ద్వారా నడ్కుడలో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయించారు. మొత్తం ఆరుచోట్ల వీటిని ఏర్పాటు చేసి మీటర్లు బిగించారు. ఇందుకు గాను రూ. 13లక్షల వరకు ఖర్చయింది.

విద్యుత్ చార్జీలు సగానికిపైగా ఆదా..

గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్ల నిర్వహణ పంచాయతీ చూస్తోంది. ఎప్పుడైనా సమస్య ఎదురైతే సంబంధిత టెక్నీషియన్లు వచ్చి చూసి సరి చేస్తున్నారు. అయితే, సౌరకాంతి సహాయంతో తయారైన కరెంట్‌ను గ్రామంలో వీధి దీపాలకు, బోర్లకు వినియోగిస్తున్నారు. దాదాపు 160కి పైగా విద్యుత్ దీపాలతో పాటు మూడుకుపైగా బోర్లు నడుస్తున్నాయి. సోలార్ వ్యవస్థ రాకముందు గ్రామ పంచాయతీకి నెలకు రూ. 50వేల వరకు కరెంట్ చార్జీ వచ్చేది. బడ్జెట్ లేక భారంగా మారిన బిల్లులను సక్రమంగా కట్టేవారు కాదు. సోలార్ వచ్చిన తర్వాత రూ. 15వేల నుంచి రూ. 20వేల మధ్యలోనే విద్యుత్ చార్జీలు వస్తున్నాయి. ఇది గ్రామ పంచాయతీకి పెద్ద ఉపశమనమనే చెప్పాలి. 22కిలో వాట్ల విద్యుతుత్పత్తి జరిగితే మిగులు విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు విక్రయిస్తున్నారు.

గ్రామ జనాభా మొత్తం	1,843
మహిళలు 953	పురుషులు 890
గ్రామ ఓటర్లు మొత్తం	1,337
మహిళలు 719	పురుషులు 618

విద్యుత్ చార్జీల బాధ లేదు



గ్రామంలో సౌర యూనిట్లు ఏర్పాటు చేయకముందు విద్యుత్ బిల్లులు భారీగా వచ్చేవి. ప్రస్తుతం గతంతో పోలిస్తే పావుశాతం చార్జీలు వస్తున్నాయి. కరెంట్ చార్జీలు కట్టాలనే బాధ తప్పింది. ఇందుకు కృషి చేసిన గత కలెక్టర్ నారాయణ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి కూడా ధన్యవాదాలు.

– బద్దం మధులిక, సర్పంచ్

మర్చిపోలేని మేలు చేశారు



మా ఊరికి ఏదైనా చేయాలని కోరిన వెంటనే గత కలెక్టర్ నారాయణ రెడ్డి సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. సౌర పలకలు ప్రస్తుతం ఊరంతా వెలుగులు పంచుతున్నాయి. ప్రజలు మర్చిపోలేని విధంగా మేలు చేశారు. వేరే గ్రామాలు కూడా మావైపు చూస్తున్నాయి.

– కె సుధాకర్, జీజీ నడ్కుడ



ప్రకృతి ఒడిలో పల్లె అందాలు

చుట్టూ పచ్చని పొలాలు.. మరోవైపు తటాకం.. మధ్యలో ప్రశాంత వాతావరణంలో చిన్న పల్లెటూరు.. ప్రకృతి ఒడిలో అలరారుతూ ఆకట్టుకుంటోంది కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలంలోని తిమ్మాపూర్ గ్రామం.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఉమ్మడి జిల్లా నుంచి అరుణాచలానికి బస్సులు

- ప్రతి పౌర్ణమికి అందుబాటులో..
- 10 రోజుల ముందు బుక్ చేయాల్సిందే..

ఖలీల్‌వాడి : నిజామాబాద్, కామారెడ్డి నుంచి అరుణాచలంకు వెళ్లేందుకు రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉంటాయని, 10 రోజుల ముందుగా రిజర్వేషన్ చేసుకోవాలని డిప్యూటీ ఆర్‌ఎం(ఆపరేషన్) సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పౌర్ణమికి ఈ బస్సులు అందుబాటులో ఉంటుందన్నారు. ఈనెల 30న రాత్రి 8 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, 1వ తేదీ ఉదయం వరకు కాణిపాక, గోల్డెన్‌టెంపుల్, అరుణాచలం గిరి ప్రదర్శన జరుగుతుందన్నారు. 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరి 2వ తేదీ మధ్యాహ్నం నిజామాబాద్‌కు బస్సులు చేరుకుంటాయన్నారు. నిజామాబాద్‌లో రాజధానిలో ఒకరికి రూ.4,800, పిల్లలకు రూ.3,900, కామారెడ్డి నుంచి రూ. 4 వేలు, పిల్లలకు రూ.3,300 ఉండగా సూపర్ లగ్జరీ బస్సుకు నిజామాబాద్ నుంచి రూ.4,200, పిల్లలకు 3,400, కామారెడ్డి నుంచి రూ.4వేలు, పిల్లలకు రూ.3,300 ఉంటుందన్నారు.

క్లుప్తంగా

బీసీ కులగణన చేపట్టాలి




తెయూ(డిచ్‌పల్లి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులగణన చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన చేయకపోవడంతో బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనకబాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2011లో నిర్వహించిన 15వ కులగణనకు సంబంధించిన వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి నాయకులు శివ, సూర్య, మల్లికార్జున్, కృష్ణ, ప్రకాష్, రాము, దినేష్, నరేష్ పాల్గొన్నారు.

పనితీరులో వెనక'బడి'!

- ప్రభుత్వ పాఠశాలల గ్రేడింగ్ విడుదల చేసిన కేంద్ర విద్యా శాఖ
- వెనకబడిన ఉమ్మడి జిల్లా
- మౌలిక వసతుల్లో అంతంతమాత్రమే..

సిరికొండ: కేంద్ర విద్యా శాఖ ఇటీవల విడుదల చేసిన ప్రభుత్వ పాఠశాలల పనితీరు గ్రేడింగ్ సూచికలో ఉమ్మడి జిల్లా వెనకబడింది. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కొరత, డిజిటల్ విద్యా విధానం లేకపోవడం, ఉపాధ్యాయుల కొరతతో ఫెర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు వెనకబడ్డాయి. కేంద్ర విద్యా శాఖ 2021–22 సంవత్సరానికి సంబంధించి అన్ని రాష్ట్రాల్లో విద్యా స్థితిగతులపై అధ్యయనం చేసి పనితీరు గ్రేడింగ్ సూచికలను విడుదల చేసింది. ఎన్‌సీఈఆర్‌టీ, యూ–డైస్, న్యాస్, ఎండీఎం ద్వారా వివరాలను సేకరించిన కేంద్ర విద్యా శాఖ వాటిని క్రోడీకరించి ఫలితాలను ప్రకటించినది. జిల్లాల వారిగా విడుదల చేసిన ఫలితాల్లో నిజామాబాద్ ఆరో స్థానంలో, కామారెడ్డి 18వ స్థానంలో నిలిచాయి. అభ్యసన సామర్థ్యాల మదింపు, మౌలిక వసతులు,



డిజిటల్ అభ్యసనం, పాఠశాల భద్రత, పరిపాలన విధానం, ప్రభావంతమైన తరగతి గది మొదలైన అంశాలలో ఫలితాలను విశ్లేషించారు. ప్రభావంతమైన తరగతి గది, డిజిటల్ లెర్నింగ్ ఉమ్మడి జిల్లాను కొంతమేర నిలబెట్టగా మిగిలిన అంశాలలో పూర్తిగా వెనకబడినది.

ప్రక్షాళన అవసరం

ప్రాథమిక విద్యాశాఖలో విద్యార్థిని పాస్ చేయించే ప్రక్రియలో సూక్ష్మప్రగతిని ఉపాధ్యాయులు అంచనా వేయలేకపోతున్నారు. అలాగే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంది. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 1200 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లు, మూత్రశాలలు, అదనపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్లు ఉన్న బోధించే ఉపాధ్యాయులు లేక డిజిటల్ విద్య అందని ద్రాక్షగా మారింది. శిథిలావస్థకు చేరిన తరగతి గదులు పాఠశాల భవనాల వల్ల ఉమ్మడి జిల్లా వెనుకబడి ఉంది. మన ఊరు మన బడి పథకం మొదటి విడత కింద కొన్ని పాఠశాలల్లో మాత్రమే వసతులు కల్పించారు. రెండో విడత ఇంకా ప్రారంభం కాలేదు. మధ్యాహ్న భోజనం నిర్వహణలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యమైన భోజనం అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఒక్క గాంధారి మండలంలో తప్ప మిగతా మండలాల్లో ఇన్‌చార్జి మండల విద్యా శాఖ అధికారులు ఉండటంతో విద్యా వ్యవస్థలో పర్యవేక్షణ గాడి తప్పింది.

కేంద్ర నివేదికలో ఉమ్మడి జిల్లాకు వచ్చిన మార్కులు

అంశం	మొత్తం మార్కులు	నిజామాబాద్	కామారెడ్డి
అభ్యసన సామర్థ్యాలు	51	31	27
ప్రభావవంతమైన తరగతి గది	90	83	74
మౌలిక వసతులు	35	31	30
పాఠశాల భద్రత–విద్యార్థి సంరక్షణ	50	15	07
డిజిటల్ లర్నింగ్	84	63	69
పరిపాలన విధానం	290	127	119
మొత్తం	600	350	326

వసతులు కల్పించాలి



పనితీరు గ్రేడింగ్ నివేదికలో కొన్ని అంశాల్లో బాగా వెనకబడ్డాం. బడుల్లో మౌలిక వసతుల కల్పన జరగాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. నాణ్యమైన బోధనను విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలి.

– సురేష్, పీజీహెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

యథేచ్ఛగా ఇసుక దందా!

- కందకుర్తి, పేపర్‌మిల్ గ్రామాల్లో భారీగా ఇసుక డంపులు
- పట్టించుకోని అధికారులు

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గ్రామంలో అక్రమ ఇసుక నిల్వలు భారీగా దర్శనమిస్తున్నాయి. ఖాళీ ప్రదేశాలు కనపడితే చాలు ఇసుక డంపు చేస్తున్నారు. కందకుర్తి, పేపర్‌మిల్ గ్రామాల నుంచి నిత్యం ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పగలు రాత్రీ అనే తేడా లేకుండా మండలం నుంచి నిజామాబాద్, భైంసా పట్టణాలకు టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ముందు నుంచే ఇసుక తరలుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.



కందకుర్తి గ్రామంలో ఇసుక డంపులు

జెడ్పీటీసీ మేక విజయ ఇటీవల సంబంధిత శాఖల అధికారులకు ఇసుక దందాపై ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. కొందరు నాయకులు, అక్రమార్కులు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఒత్తిడి తీసుకు వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వైశ్యులు వ్యాపారాల్లో వృద్ధి సాధించాలి

నిజామాబాద్ సిటీ: వైశ్యులు వ్యాపారాలు మాని ఇతర రంగాల వైపు వెళ్తున్నారని, ప్రతి వైశ్యుడు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు వైశ్య బిజినెస్ నెట్‌వర్క్(వీబీఎన్) స్థాపించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు ఎమ్మెడి శివకుమార్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ హోటల్ నిఖిల్‌సాయిలో వైశ్య బిజినెస్ నెట్‌వర్క్ నిజామాబాద్ బ్రెయిన్‌స్టోమింగ్ సమావేశం జరిగింది. వీబీఎన్ సభ్యులు నాణ్యమైన వ్యాపార నిపుణులతో తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అభివృద్ధి చెందిన నగరాల్లో వీబీఎన్‌ను విస్తరిస్తున్నట్లు తెలిపారు. వీబీఎన్ అపెక్స్ చైర్మన్ రాజేష్ డొంకేశ్వర్ మాట్లాడుతూ సంస్థలో సభ్యుడిగా చేరిన వారికి వారి వ్యాపారంలో సపోర్ట్ చేయాలనే దీనిని ప్రారంభించినట్లు చెప్పారు. చంద్రశేఖర్ వేముల, శ్రీనివాస్ కల్లూరి, అరుణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివకుమార్

రేపు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ రాక

సిరికొండ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి స్వగ్రామమైన మండలంలోని రావుట్లకు మంగళవారం వస్తున్నట్లు సర్పంచ్ భూదెవ్వ రాజన్న తెలిపారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా నియామకమైన లింబాద్రికి గ్రామంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి వస్తున్నట్లు వారు తెలిపారు.

వర్సిటీ సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెయూ ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు తరుణ్ డిమాండ్ చేశారు. వర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని ఆదివారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థులు నిరసన చేపట్టారు. తరుణ్ మాట్లాడుతూ.. క్యాంపస్ రోడ్ల వెంట వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి బయట తిరుగడానికి విద్యార్థులు భయపడుతున్నారని చెప్పారు. హాస్టల్ గదుల్లో ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్‌లు లేవని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాలికల కోసం అదనపు హాస్టల్ నిర్మించాలన్నారు. ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన వాకాటి కరుణ వర్సిటీని సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. శేఖర్, విష్ణువర్ధన్, సంతోష్, సాయి, అజయ్, ఆశిష్, అరవింద్, అనిల్, ముఖేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గుండారం ప్రభుత్వ పాఠశాల 1992–93 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు అప్పల కిష్టయ్య(హెచ్‌ఎం), రాజగౌడ్, డి నర్సయ్య, వరదచార్యులు, మల్కయ్య, రాందాస్, భోజగడ్, ఎల్లాగౌడ్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు కోర్వ శ్రీనివాస్, గంగాధర్, సత్యనారాయణ, రాజు, సాయికుమార్, వెంకట్‌రెడ్డి, సవిత, సుధారాణి, లక్ష్మీబాయి, స్వరూప పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో ఘనంగా బోనాలు



ఉత్సవాల్లో పాల్గొన్న స్పీకర్ పోచారం



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే సురేందర్



ఎల్లారెడ్డిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముత్యాల పోచమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ దంపతులు, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారి ఫలారం బండి వద్ద స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే సురేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఊర దేవతకు పూజలను నిర్వహించిన అనంతరం మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లారు. కౌన్సిలర్లు శ్రీకాంత్, సాయిలు, ఆలయ కమిటీ కార్యదర్శి వినోద్, సభ్యులు శ్రీనివాస్, గాంధారి ఏఎంసీ చైర్మన్ సత్యం రావు, మాజీ మంత్రి ఆంజనేయులు, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు. డీఎస్పీ జగన్నాథరెడ్డి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

ఐటీఐలో అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మోర్తాడ్(బాల్కొండ): ఐటీఐలో రెండో దశ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కమ్మర్‌పల్లి ఐటీఐ ప్రిన్సిపాల్, నిర్మల్ జిల్లా కన్వీనర్ కె.శాంతారాం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. సీట్ల కేటాయింపు సమాచారాన్ని ఎస్‌ఎంఎస్ ద్వారా తెలియజేస్తామని వెల్లడించారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి www. iti. telangana. gov. in వెబ్‌పోర్టల్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కప్పల వాగులోకి కాళేశ్వరం జలాలు

భీమ్‌గల్: కాళేశ్వరం జలాలను ప్యాకేజీ 21 ద్వారా మండలంలోని బడా భీమ్‌గల్ వద్ద కప్పల వాగులోకి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలు లేకున్నా అన్నదాతకు బాసటగా నిలవడం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. కాళేశ్వరం నీళ్ల రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీలోకి చేరుకొని అక్కడి నుంచి సారంగపూర్, మెంట్రాజ్‌పల్లి పంప్ హౌజ్ ప్యాకేజీ 20, 21 ద్వారా పెద్ద వాగు, కప్పల వాగులోకి చేరుకున్నాయని తెలిపారు. వాగులోకి ఎదురెక్కి వస్తున్న కాళేశ్వరం జలాలు చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. ప్యాకేజీ 21 ద్వారా వచ్చిన నీటితో పెద్ద వాగు, కప్పల వాగు ఎప్పుడూ సజీవంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్ పాల్గొన్నారు.



నీటి విడుదల అనంతరం ప్రజాప్రతినిధులతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

క్రైం కార్నర్

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

సుభాష్‌నగర్: హత్య కేసులో నగరంలోని గుర్బాబాది రోడ్డులో గల సార్వజనిక్ శ్మశానవాటిలో నివసిస్తున్న నాగుల మల్లేష్, నాగుల దశరథ్‌ను అరెస్ట్ చేసినట్లు నిజామాబాద్ టౌన్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఆదివారం మూడో టౌన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మల్లేష్, దశరథ్ తమ తల్లితో కలిసి శ్మశానవాటికలో నివసిస్తున్నారు. వారి తల్లికి మతిస్థిమితం లేదు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 14న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో నిందితులిద్దరూ సినిమా చూసి శ్మశానవాటికకు చేరుకున్నారు. ఆ సమయంలో బీహార్‌కు చెందిన హమాలీ అరుణ్ సదా వారి తల్లితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అది చూసిన వారు అరుణ్ సదాను కర్రతో విచక్షణారహితంగా కొట్టారు. అటుగా వెళ్తున్న ఆటోవాలాలు క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అరుణ్ సదా మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టగా, నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. పోలీసులు వారి నుంచి కర్రను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.



నిందితులను చూపుతున్న పోలీసులు

గంజాయి విక్రేతలు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గంజాయి విక్రయిస్తున్న పాన్‌షాపు యజమాని షేక్ నయీంను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్టీవెన్‌సన్ తెలిపారు. అతని నుంచి 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నయీంను విచారించగా పెర్కిట్‌కు చెందిన షేక్ సోఫియాన్ తనకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు వెల్లడించాడని ఎస్‌హెచ్‌వో చెప్పారు. అలాగే మరో వేయి గ్రాముల గంజాయికి ఆర్డర్ ఇచ్చినట్లు నయీం పోలీసులకు తెలిపాడు. దీంతో నయీంకు సరఫరా చేస్తున్న సోఫియాన్‌ను అరెస్టు చేసి ఇద్దరి నుంచి 1,200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

మద్నూర్: మద్నూర్‌కు చెందిన చిట్టెం శ్రీనివాస్(26) స్థానిక గురు ఫంక్షన్ హాల్ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు.. శ్రీనివాస్ సాలూర మండల కేంద్రంలోని తన అత్తగారి ఇంటి వద్ద భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. అక్కడే కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. ఈ నెల 13న సాలూర నుంచి శ్రీనివాస్ మద్నూర్‌కు వచ్చాడు. తన భార్య తనతో మద్నూర్‌కు రావడం లేదని పలువురితో బాధను పంచుకున్నాడు. ఈ క్రమంలో 14న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన ఆచూకీ కోసం వెతకగా చెట్టుకు ఉరి వేసుకొని ఉన్నట్లు సమాచారం వచ్చిందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

రైలు కిందపడి వృద్ధుడు..



కామారెడ్డి క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భిక్కనూర్, అంతంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ముంబై నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం రావడంతో కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి వయస్సు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం బట్టాపూర్ శివారులోని కుశీవల ఫంక్షన్ హాల్‌లో పేకాడుతున్న పది మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వారి నుంచి రూ.9,070 నగదు, 9 ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్గట్ల ఏఎస్సై గంగాధర్ పేకాడుతున్న వారిని అరెస్టు చేశారని తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మోపాల్: మండలంలోని సిర్పూర్‌కు చెందిన దీపిక అనే వివాహిత పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లిదండ్రులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. దీపికకు వివాహమై పిల్లలు ఉన్నారు. ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆమె ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పొంచి ఉన్న ప్రమాదం!



నవీపేట: బాసర రహదారిపై ఉన్న కల్వర్టుకు మరమ్మతులు చేయకపోవడంతో వర్షానికి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. నవీపేట, అభంగపట్నం గ్రామాల మధ్యగల బాసర రహదారిలో నిజాంసాగర్ డి–50 కాలువ ఉంది. రోడ్డు వెడల్పులో భాగంగా కల్వర్టుకు మరమ్మతులు చేసి ఇరువైపుల మొరం సరిగా వేయకపోవడంతో కోతకు గురవుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.